క్లుప్తంగా

పొలంలోకి దూసుకెళ్లిన అంబులెన్స్



నారాయణపేట రూరల్: అదుపుతప్పి ఓ 108 అంబులెన్స్ వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలిలా.. ధన్వాడకు చెందిన 108 అంబులెన్స్ ఓ డెలవరీ కేసును జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చి తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో అప్పక్‌పల్లి దాటిన తర్వాత మెడికల్ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోతుండగా అంబులెన్స్ ఎడమవైపుకు మళ్లించడంతో అదుపుతప్పి వ్యవసాయ పొలంలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరు రోగులు, క్షతగాత్రులు లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. అంబులెన్స్‌లోని సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదు.

కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రారంభం



ఊట్కూరు: మండలంలోని ఆదివారం తాజ్‌దక్కన్ ఎడ్యూకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. పేద విద్యార్థులు కంప్యూటర్ నేర్చుకోవడానికై 4 కంప్యూటర్‌లు, ప్రింటర్‌లు తదితర సామాగ్రిని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మహమ్మద్‌సలీం, నవాబ్, మహమ్మద్‌గౌస్, రాజీం, కాజమైనుద్దీన్, హస్మొత్తుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

దామరగిద్ద: మండలానికి ఇటీవల బదిలీపై వచ్చి బాధ్యతలు తీసుకున్న దామరగిద్ద ఎస్‌ఐ రాజును ఆదివారం స్థానిక నాయకుడు జాతీయ మాలల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గ్యాంగ్ హన్మంతు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. మండలంలో శాంతి భద్రలతో పాటు దళితులు హక్కుల రక్షణకు కృషిచేయాలని కోరారు.

వీరశైవ సంఘం కమిటీ ఎన్నిక

మరికల్: మండల వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బస్వరాజ్, అధ్యక్షుడిగా తిప్పయ్య, ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్, ఆకుల మల్లికార్జున్, ప్రధాన కార్యదర్శిగా బసంత్, కో–శాధికారిగా సోమనాథ్‌ను ఎన్నుకున్నారు. అలాగే మండల యువజన కమిటీ అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా బస్వరాజ్, సురేష్, ప్రధాన కార్యదర్శిగా వీరేష్, కో–శాధికారిగా సూర్యకాంత్, సహాయ కార్యదర్శిగా నాగేష్‌ను ఎన్నుకున్నారు. సంఘం జిల్లా నాయకులు జగదీశ్వర్, వీరన్నలు తెలిపారు. కార్యక్రమంలో అయ్యప్ప, శివకుమార్, వీరయ్య పాల్గొన్నారు.

నిబంధనలు పట్టవా..?



మాగనూర్: కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లు రోడ్లపైకి రావడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయి. ట్రాక్టర్లు కేజ్‌వీల్స్‌తో రోడ్లపైకి రావొద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ యాజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. దీంతో రోడ్లు ధ్వంసమై వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు కోతకు గురై బీటీరోడ్డు కాస్తా కంకర తేలి గోతులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇలాంటి వారిపై ప్రత్యేక నజర్ వేసి గుర్తించాలని వాహనాదారులు ప్రజలు కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణంలో పంటల సాగు

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలను నిర్మించింది. కానీ మండలంలోని మస్తీపురం గ్రామంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం పేరుతో బోర్డు ఏర్పాటు చేసినా.. ద్వారం నుంచి లోపలికి వెళితే అక్కడ క్రీడా సామగ్రి ఏది కనబడదు. అక్కడ పంటను సాగుచేస్తున్నారు. స్థలం తనదేనని గ్రామానికి చెందిన శివారెడ్డి ఇప్పటికీ రెండు సార్లు పంటలు వేయడం, అధికారులు వాటిని తొలగించడం జరిగింది. కానీ ముచ్చటగా మూడోసారి శివారెడ్డి అదే స్థలంలో పత్తిపంటను సాగుచేస్తున్నాడు. జూరాల ప్రాజెక్టుకు వెళ్తున్న ప్రయాణికులతో పాటు పలువురు హౌర ఇది క్రీడా ప్రాంగణమేనా అంటూ అవాక్కవుతున్నారు.



కాలినడకే శరణ్యం..

- రోడ్డున్నా బస్సులు లేవు
- ప్రైవేట్ వాహనాలే దిక్కు
- విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



పాఠశాలకు కాలినడకన వెళ్తున్న ఓబ్లాపూర్ గ్రామ విద్యార్థులు (ఫైల్)

మాగనూర్: ప్రగతి చక్రాలు పల్లెల దరిచేరడం లేదు. రోడ్డు సౌకర్యాలు ఉన్నా ఆర్టీసీ అధికారులు కరుణించకపోవడంతో ప్రయాణికులు, పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాలకు రహదారులు ఉన్నా ఆదాయం రావడం లేదనే సాకుతో అధికారులు బస్సులు నడపడం లేదు. దీంతో విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ప్రభుత్వం పల్లెలకు చదువులు చదివించాలని ప్రచారం చేస్తున్న వారికి తగిన సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విద్యార్థుల పోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు..

మండలంలోని గురువలింగంపల్లి, తళంకేరి, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి, నేరడగందొడ్డి గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు ఉన్న ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడం, అదేవిధంగా ఓబ్లాపూర్, అమ్మపల్లి, పుంజనూర్, పర్మన్‌దొడ్డి, భైరంపల్లి, గజ్జందొడ్డి గ్రామాలకు అసలు రోడ్డు సౌకర్యం లేదు. అయితే ప్రధానంగా రోడ్డు సౌకర్యం ఉన్న ఆర్టీసీ అధికారులు బస్సులు నడపకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులకు ప్రైవేట్ వాహనాలే దిక్కయ్యాయి. అత్యవసర సమయంలో నిత్యావసరానికి గ్రామీణులు కాలి నడకన మూడు కి.మీ వెళ్లి అక్కడి నుంచి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. గత రెండేళ్లలో చాలా ప్రాంతాలో అనేక రోడ్డు ప్రమాదాలు సంబవించిన సంఘటనలు కూడా ఉన్నాయి.

అమలు కాని హామీలు..

ఏటా పాఠశాల ప్రారంభంలో ప్రభుత్వం ప్రభుత్వ బడికి పంపించాలని ప్రచారం చేస్తోంది. అన్ని సౌకర్యాలు కల్పించి, విద్యార్థులకు విద్యానందిస్తామని హామీలు ఇస్తున్నా ఆచరణలో అమలు కావడం లేదు. విద్యార్థుల కోసం బస్సులు నడిపించడం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. తమ గ్రామం నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ప్రతి విద్యార్థికి నెలకు రూ. వెయ్యి ఖర్చు చేస్తున్నారు. కొందరు సుదూర ప్రాంతాలకు వెళ్లలేక తల్లిదండ్రులతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఈ విషయంలో పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించి విద్యార్థుల, ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు..



మా గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక బస్సు సౌకర్యం లేదు. అయితే చాలా మంది విద్యార్థులు బస్సు సౌకర్యం లేక మధ్యలోనే చదువును బంద్ చేయాల్సి వస్తుంది. ప్రతి రోజు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం. అయితే గేట్ నుంచి బీటీ రోడ్డు సౌకర్యం ఉంది. కావున అక్కడి నుంచి బస్సుసౌకర్యం కల్పించి సమస్య పరిష్కరించాలి.

– శృతి, పదోతరగతి, విద్యార్థిని ఓబ్లాపూర్

వర్షంలో తడుస్తూ..



ప్రస్తుతం వర్షాకాలం కావడంతో మా గ్రామానికి బస్సుసౌకర్యం లేక నిత్యం వర్షంలో తడుస్తునే గ్రామానికి చేరుకోవాల్సి వస్తుంది. అయితే వడ్వాట్, మందిపల్లి గ్రామాల మీదుగా వెళ్లే బస్సును మా గ్రామానికి వచ్చి మండల కేంద్రం మీదుగా మక్తల్‌కు వెళ్లేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– పావని, ఏడో తరగతి విద్యార్థిని, ఓబ్లాపూర్

అదనపు బస్సులు వస్తున్నాయి..



అయితే జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాలకు రోడ్డుసౌకర్యం ఉన్న బస్సు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, సామాన్య ప్రజలు పడుతున్న ఇబ్బందులు తమ దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. త్వరలోనే మరో 30అదనపు బస్సులు జిల్లాకు వస్తాయి. వెంటనే ఆయా గ్రామాలకు బస్సుసౌకర్యం కల్పిస్తాం.

– లక్ష్మిసుధా, డిపో మేనేజర్, నారాయణపేట

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

మాగనూర్: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు 28 సంవత్సరాల(1996–97 బ్యాచ్ తర్వాత ఆదివారం ఒక చోటకలుసుకున్నారు. ఇన్ని సంవత్సరాల తర్వాత తోటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగా క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అనిల్‌గౌడ్, భాస్కర్, కృష్ణారెడ్డిను పూర్వ విద్యార్థులు సన్మానించారు. సాయంత్రం వరకు సందడిగా గడిపారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్‌లు రాజు, ఆనంద్‌గౌడ్, గ్రామ పెద్దలు ప్రహ్లాద్‌రెడ్డి, చెన్నప్ప, వాకిటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కాసీం పీర్లపండగ

నర్వ: నేడు కాసీం పీర్ల సవారీ పండుగ ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పీర్ల చావిడీల వద్ద భక్తులు కాసీం పీర్లకు పూలమాలలు, దట్టీలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. మొక్కుబడులున్న భక్తులు కందూర్లు నిర్వహించారు. సోమవారం పెద్దకాసీం, చిన్న కాసీం పీర్లు సవారీలు మండలంలోని పెద్దకడ్మూర్, నర్వ, బెక్కర్‌పల్లి, రాంపూర్, కల్వాల్, లంకాల్ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మంత్రి వర్గంలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

మరికల్: మంత్రి వర్గ విస్తీరణలో ముదిరాజ్ ఎమ్మెల్యేకు స్థానం కల్పించేందుకు సీఎం రేవంత్ కృషి చేయాలని మాత్స్య సహకార సంఘం మండల అధ్యక్షుడు నారాయణ అన్నారు. మండలంలోని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో అన్ని రంగాల్లో వెనకబడిన ముదిరాజ్‌లను బీసీ డీ, నుంచి బీసీ ఏలోకి మార్చాలని ముఖ్యమంత్రి అందజేసే కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పొందుపర్చిన తమ సమస్యలను పరిష్కరించాలన్నారు. తమకు ప్రభుత్వమే ఉచితంగా చేపపిల్లలను అందజేసి ఆదుకోవాలని తెలిపారు. అలాగే ముదిరాజ్ ఫైనాస్ కార్పొరేషన్ ఏర్పాటుచేసి రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, తిమ్మన్న, మొగులప్ప, కొండయ్య, నర్సింహులు, కుర్మన్న, శేఖర్, శ్రీను, రామకృష్ణ, రాములు, రాయుడు, చంద్రశేఖర్, రమేష్ పాల్గొన్నారు.

గురుపూర్ణిమ వేడుకలను విజయవంతం చేద్దాం



నారాయణపేట రూరల్: ఆశాడ శుద్ధ పూర్ణిమ రోజు నిర్వహించే మాతా మాణికేశ్వరీ అమ్మవారి జయంతిని విజయవంతం చేద్దామని సూర్యనందిక్షేత్రం కార్యదర్శి శివయ్యస్వామి తెలిపారు. పట్టణంలోని చౌక్‌బజార్‌లో అమ్మవారి భక్తులతో కలిసి ఆదివారం వేడుకల కరపత్రం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 21న గురుపౌర్ణమి రోజు ఉదయం 9గంటలకు యానగుంది క్షేత్రంలో మహారుద్రాభిషేకం, పాదపూజ సాయంత్రం 7గంటలకు రథోత్సవం నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా పట్టణ శివారులోని పగిడిమర్రి రోడ్డులోని వ్యాసాశ్రమంలో ప్రత్యేక పూజలు, పాదపూజ, డోలారోహణ వేడుకలు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై అమ్మవారి కృపాకు పాత్రులు కావాలని కోరారు.

ఊట్కూరు: మండలంలోని పగిడిమారి శివారులో గల మాతామాణికేశ్వరి ఆశ్రమంలో ఈ నెల 21న మాతమానికేశ్వరి జయంతిని నిర్వహిస్తున్నట్లు ఆదివారం శివయ్యస్వామి తెలిపారు. ఈ మేరకు.. వాల్ పోస్టర్‌ను వారు విడుదల చేశారు. కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మదిరకు తరలిన పీవైఎల్ నాయకులు



జిల్లా పీవైఎల్ బృందం సభ్యులు

నారాయణపేట రూరల్: పీవైఎల్ రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక శిక్షణ తరగతులను పేట నుంచి ఆదివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మదిరలో రెండురోజుల పాటు జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఈశ్వర్, ఉపాధ్యక్షుడు ఎండీ సలీం మాట్లాడుతూ.. యువతను సక్రమ మార్గంలో నడిపించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా పెడదొరణుల నుంచి విముక్తి కల్పించాలన్నారు. సమస్యలపై పోరాటాలు చేస్తూ, ప్రశ్నించే చైతన్యాన్ని పెంపొందించాలన్నారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన విద్యా, వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవి, తిర్మలేష్, శ్రీకాంత్, బాలు, శ్రీను, అంజి, రాము, సాయి, రవి, బాలు, గణేష్, ఆంజనేయులు, బాలకృష్ణ పాల్గొన్నారు.

చిట్టెం కృషి వల్లే మక్తల్‌కు కోర్టు మంజూరు

మక్తల్: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషితోనే కోర్టు మంజూరైందని న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి, విల్సన్, ఖాజమైనోద్దిన్, మాజీ మార్కెట్ చైర్మన్ నర్సింహగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులు తెలియజేయడంతో మక్తల్‌కు కోర్టు మంజూరు చేయించారని గుర్తుచేశారు. అనంతరం న్యాయవాదులు మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గుప్తా, వెంకటేష్, పట్టణ అధ్యక్షుడు చిన్న హన్మంతు, నర్సింహారెడ్డి, ముడుమాల్ బాల్‌రాజు ఈశ్వర్‌యాదవ్, నేతాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు సంబరం

మక్తల్: పట్టణంలో బ్రహ్మణవాడకాలనీ మహిళలు ఆదివారం గోరింట పండగ జరుపుకున్నారు. ఘనంగా మెహింది పండుగ ఘనంగా జరుపుకోన్నారు. ఆషాఢమాసం పురస్కరించుకుని పలువురు మహిళలు, ఆడపిల్లలు ఒకచోటకి చేరుకుని చేతులపై గోరింటాకు పెట్టుకుని మురిసిపోయారు. వారు మాట్లాడుతూ.. ఆశాఢమాసం వచ్చిందంటే చాలు మహిళలు, ఆడ పిల్లలు తమ చేతులపై గోరింట డిజైన్లతో అలంకరణ చేసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



పాతమున్సిపాలిటీ రోడ్డుపై స్థానికుల ఇబ్బందులు



బస్టాండ్‌రోడ్డుపై నిలిచిన నీరు



సంతబజారులో వినియోగదారుల ఇక్కట్లు



మక్తల్‌లో..

ఆత్మకూర్: ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం ఎడతెరపి లేకుండా కురవడంతో అతలాకుతలంగా మారింది. ఆదివారం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి దాక వాన దంచికొట్టింది. విద్యుత్ తీగలు తెగిపడడంతో ఆత్మకూర్‌లో అంధకారం నెలకొంది. మున్సిపాలిటీ కేంద్రంలోని రోడ్లపై వర్షం నీరు చేరి గుంతలమయంగా మారాయి. అన్ని వార్డుల్లో పరిస్థితి ఇలాగే ఉండడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక గాంధీచౌక్‌లో వర్షపు నీరు భారీగా చేరడంతో పలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఆదివారం సంత కావడంతో ఇటు వ్యాపారులు, అటు కొనుగోలుదారులు ముప్పతిప్పలు పడ్డారు. ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మక్తల్: పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం భారీగా వర్షం రావడంతో ఎల్లమ్మ కుంటలో వర్షపునీరు చేరి జలమయంగా మారింది. మురుగు కాల్వలు నిండి చెత్తచెదారం అడ్డంగా ఉండటంతో నీరు రోడ్లపై నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు.

ధ్యానంతో రుగ్మతలు దూరం



గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఆంజనేయులు

నారాయణపేట రూరల్: నిత్యం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడంతో వారికి మానసిక ప్రశాంతత లభించి ఆరోగ్యకరంగా తయారవుతారని శ్రీరామచంద్ర మిషన్ జిల్లా కో –ఆర్డినేటర్ గద్దె ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని పతాంజలి యోగా సమితి ఆవరణలో శ్రీసాయి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ గందెకార్తిక్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ధ్యాన (మెడిటేషన్) శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంజనేయులు ధ్యానం చేయడంతో కలిగే ఉపయోగాలు, చేసే విధానం వవరించారు. అన్ని వయస్సుల వారు ప్రతిరోజు గంటపాటు ధ్యానం చేయాలన్నారు. ఆరోగ్యంతోపాటు వివేకం, విజ్ఞానం పెంపొందిచబడుతాయన్నారు. అదేవిధంగా ఈ నెల 21న నందిగామ మండలం కాన్హా శాంతివనంలో గురుపౌర్ణిమ సందర్భంగా ప్రత్యేక శిబిరం జరుగుతుందన్నారు. జిల్లా, చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 23నుంచి 25 వరకు పూజ్య గురుదేవులు చారీజీ జన్మదిన వేడుకలు విజయవంతం చేయాలన్నారు. అనంతరం గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గందె ఉమాకాంత్, సురేష్, శిరీష, రాజేందర్, యశ్వంత్, రఘు, సంజీవ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి దాతలు సహకరించాలి



నిర్వాహకులకు విరాళం ఇస్తున్న రాములు

మరికల్: మండల కేంద్రంలో నిర్మిస్తున్న సరస్వతీ ఆలయ నిర్మాణాకి దాతలు సహకారించాలని నిర్వాహకులు దుబాయ్ రాములు, కృష్ణయ్య, జగదీష్ అన్నారు. ఆదివారం ఎలింగడ్లకు చెందిన సూతరి రాములు ఆలయ నిర్మాణం కోసం తనవంతు సాయంగా రూ.10,116లను ఆలయ కమిటీ నిర్వాహకులకు విరాళంగా ఇచ్చారు. మరింత మంది దాతలు ముందుకొచ్చి సహకారిస్తే నెలరోజుల వ్యవధిలో నిర్మాణం పూర్తిచేస్తామని వారు తెలిపారు. ఇప్పటి వరకు ఆలయ నిర్మాణానికి సహకారించిన దాతలను అభినందించారు. కార్యక్రమంలో నారాయణ, కృష్ణయ్య, సాయితేజ, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు



వాహనదారులతో మాట్లాడుతున్న కానిస్టేబుల్

నారాయణపేట రూరల్: ప్రతి వాహనదారుడు విధిగా ట్రాపిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపిస్తే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామని కానిస్టేబుల్ దేవేందర్ అన్నారు. స్థానిక శ్రీ సత్యనారాయణచౌరస్తాలో వాహనదారులకు ఆదివారం సాయంత్రం అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నంబర్‌ప్లేట్ లేకపోతే సదరు వాహనాలను క్రైం చేయడానికి వాడుతున్నారని గుర్తించాల్సి వస్తుందన్నారు. నిబంధన ప్రకారమే నంబర్ ప్లేట్ ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్, సీటుబెల్టును తప్పనిసరిగా ఉపయోగించాలని, అవి మన ప్రాణాలను కాపాడుతాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సంతోష్, గోవింద్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ బదిలీలపై హర్షం



హర్షవర్ధన్‌రెడ్డి సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మరికల్: దశాబ్దా కాలం నుంచి పెండింగ్‌లో ఉన్నా ఉపాధ్యాయల బదిలీలు, పదోన్నతులు పండితుల అఫ్‌గ్రేడ్‌కు కృషి చేసిన పీఆర్టీయూటీజీ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. మండలంలోని పెద్దచింతకుంటలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పీఆర్టీయూటీజీ అధ్యక్షుడు మహేష్‌తోపాటు ఇతర ఉపాధ్యాయుల సమస్యలకు మంచి మార్గం చూపిన హర్షవర్ధన్‌రెడ్డి సేవలు మారవలేమని, ఆయనను శాలువాతో సన్మానించి అభినందించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను కూడా వెంటనే రిలీవ్ చేసి వారికి కేటాయించిన పాఠశాలాలకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని వారు ఆయనను కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ యుగందర్‌రెడ్డి, నారాయణ, శ్రీశైలం, శివ, తిమ్మన్న, శివాజీ పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ బదిలీ

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనురాధ మెదక్ జిల్లా తూప్రాన్‌కు బదిలీపై వెళ్లారు. ఆదివారం విద్యార్థినులు ఇన్నాళ్లు ప్రిన్సిపాల్ చూపిన అప్యాతను గుర్తు చేసుకొని ఆవేదన వ్యక్తం చేశారు. మరికల్ గురుకుల పాఠశాలకు వచ్చే నూతన ప్రిన్సిపాల్ వివరాలు తెలియాల్సి ఉంది.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



మద్దూర్‌లో కుటుంబ సభ్యులకు బాండ్లను అందజేస్తున్న డ్రైవర్లు

మద్దూరు: తోటి డ్రైవర్ అనారోగ్యంతో మృతి చెందడంతో తోటి డ్రైవర్లు కలిసి అతని ఇద్దరు కూతుళ్లపై రూ. 60 వేలు ఫిక్సిడ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను కుటుంబానికి ఆదివారం అందజేశారు. మండలంలోని దోరేపల్లికి చెందిన ఖాజపాషా ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందాడు. ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే వ్యక్తి మృతిచెందడంతో కుటుంబ వీధిన పడింది. ఇది గ్రహించిన జిల్లా డ్రైవర్ యూనియన్, మండల డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో 60వేలు పోగుచేసి కూతుళ్లపై పోస్టాఫీస్‌లో ఫిక్సిడ్‌డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో డ్రైవర్లు వెంకట్‌రాములు, సంతోష్, బాలకృష్ణ, ఆంజనేయులు, రాజు, గుండప్ప, మొగులప్ప, రఘు, శ్రీను, చిన్ని శ్రీనివాస్, నరేందర్, కాశీం, మహేందర్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల పరిధిలోని ముగ్దంపూర్‌లో పక్షం రోజుల క్రితం కురుమకోళ్ల అశోక్ (34) అనారోగ్యంతో మృతిచెందాడు. విషయాన్ని తెలుసుకున్న ఆయన స్నేహితులు పదోతరగతి 2005–06 బ్యాచ్ బృందం వారు రూ. 50వేలు మృతుడి కూతుర్లు సుమలత, దీక్షత పేరుపైన పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేశారు. ఆర్థిక సాయం చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థినికి అభినందన

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామానికి చెందిన ప్రశాంత్‌కు నల్లగొండలోని ఓ ప్రముఖ ఇంజనీర్ కళాశాలలో పాలిటెక్నిక్ కంప్యూటర్ ఇంజనీర్ సీట్ సంపాదించడంతో ఆ గ్రామ మాజీ సర్పంచ్ అంబ్రేష్, మాజీ ఎంపీటీసీ గజ్జి ఆంజనేయులు, బీఆర్ఎస్ మండల నాయకులు వెంకటేష్ ఆదివారం విద్యార్థినీ అభినందించారు.

పార్టీ బలో పేతానికి కృషి

నారాయణపేట రూరల్: తెలంగాణలో తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి కలిసికట్టుగా పని చేద్దామని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీనివాస్‌నాయుడు అన్నారు. ఆదివారం పట్టణంలోని ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు.. గ్రామస్థాయిలో పార్టీకి ఇంకా గుర్తింపు ఉందని, బడుగు, బలహీన వర్గాలకు అండగ నిలిచిన పార్టీగా పేరు ందన్నారు. ఓంప్రకాష్, రమణ, బీమన్న, సలీం, పాల్గొన్నారు.